## మొదటి పాఠం

## الدرس الأول

### నమాజ్ ఆదేశం, దాని ఘనత

### حكم الصلاة وفضلها

నమాజ్ ఇస్లాం మూల స్థంబాలలో రెండవది. అది ప్రాజ్ఞ వయస్సుకు చేరిన, బుద్ధిమంతుడైన ప్రతీ ముస్లింపై విధిగా ఉంది. ప్రాజ్ఞ వయస్సుకు చేరడం అంటే పదిహేను సంవత్సరాలు నిండడం, లేదా మర్మాంగం చుట్టున వెంట్రుకలు మొలవడం, లేదా స్వప్నస్ఖలనం ద్వారా ఇంకే విధంగానైనా ఇంద్రియం వెలువడడం. బాలికలకు నెలవారి రక్తస్రావం అంటే బహిష్టు రావడం. మనిషికి వీటిలో ఏ ఒక్కటి జరిగినా అతను ప్రాజ్ఞవయస్సుకు చేరినట్లు.

నమాజు విధిని తిరస్కరించే వాడు కాఫిర్ (సత్య తిరస్కారి) అవుతాడని ఏకాభిప్రాయం (ఇజ్మాఅ్) ఉంది. ఇక బద్ధకం, నిర్లక్ష్యంతో మొత్తానికే నమాజు చేయనివాడు కూడా కాఫిర్ అవుతాడని సహాబాలు ఏకీభవించారు (ప్రవక్త సహచరుల ఇజ్మాఅ్ ఉంది). ప్రళయదినాన మానవునితో తొలి లెక్క నమాజు గురించే జరుగును. నమాజ్ దాని సమయపాలనతో చేయుట విధిగా ఉంది. అల్లాహ్ ఆదేశం చదవండి: **వాస్తవానికి నమాజ్ విశ్వాసులు నిర్ణీత సమయాలలో పాటించవలసిన ధర్మం. (సూరె నిసా 4: 103)**. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారని ఇబ్ను ఉమర్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః "ఇస్లాం పునాది ఐదు విషయాలపై ఉందిః 1- అల్లాహ్ తప్ప సత్య ఆరాధ్యుడు మరొకడు లేడు, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ యొక్క ప్రవక్త అని సాక్ష్యమిచ్చుట. 2- నమాజు స్థాపించుట. 3- జకాత్ (విధిదానం) చెల్లించుట. 4- హజ్ చేయుట. 5- రమజాను ఉపవాసాలు పాటించుట". (బుఖారి 8, ముస్లిం 16). జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ రజియల్లాహు అన్హుమా ఉల్లేఖనం ప్రకారం, నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పగా విన్నాను: "ఒక మనిషి మరియు షిర్క్, కుఫ్ర్ (బహుదైవారాధన, సత్యతిరస్కారం) మధ్య ఉన్న వ్యత్యాసం నమాజును విడనాడడం". (ముస్లిం 82).

నమాజు పాటించడంలో చాలా గొప్ప ఘనతలున్నాయి, వాటిలో కొన్ని: ప్రవక్త ﷺ ఉపదేశించారని, అబూ హురైర ؓ ఉల్లేఖించారు: "ఎవరైనా తన ఇంట్లో వుజూ చేసుకొని, అల్లాహ్ యొక్క విధుల్లో ఒక విధి నిర్వహించుటకు అల్లాహ్ గృహాల్లోని ఒక గృహం (మస్జిద్)లో ప్రవేశిస్తే, అతను వేసే అడుగుల్లో ఒక దానికి బదులుగా ఒక పుణ్యం లభిస్తే, మరో దానికి బదులుగా ఒక స్థానం పెరుగుతుంది". (ముస్లిం 666). అబూహురైర ؓ ఉల్లేఖనం ప్రకారం: మహనీయ ప్రవక్త ﷺ ఇలా అడిగారు: "పరమ ప్రభువైన అల్లాహ్ ఏ విషయాల ఆధారంగా అపరాధాలను మన్నిస్తాడో, స్థాయిని ఉన్నతం చేస్తాడో అలాంటి విషయాలు మీకు తెలుపనా?" దానికి సహచరులు 'దైవప్రవక్తా తప్పక సెలవీయండి' అని బదులిచ్చారు. అప్పుడాయన ఇలా బోధించారు: "(1) వాతవరణం, పరిస్థితులూ అనుకూలంగా లేనప్పటికీ వుజూ పూర్తిగా చెయ్యటం. (2) మస్జిద్ వైపునకు అధికంగా అడుగులు వెయ్యడం. (3) ఒక నమాజ్ తరువాత మరో నమాజ్ కొరకు నిరీక్షించడం, ఇది రిబాత్ తో సమానం[1]". (ముస్లిం 251).

[1] రిబాత్ అంటే సత్యాసత్యాల మధ్య పోరాటం సాగే రోజుల్లో రాత్రిళ్ళు పహరా కాయడం. శాంతి కాలంలో నమాజ్ పట్ల మక్కువ, పోరాటపు రోజుల్లో ప్రాణాలొడ్డి పహరాకాయడంతో సమానమని అర్థం.

ప్రవక్త ﷺ ఉపదేశించారని అబూ హురైర ؓ ఉల్లేఖించారు: "మస్జిద్ కు వస్తూ పోతూ ఉండేవారు (ఎంత అదృష్టవంతులంటే), వారు వస్తూ పోతూ ఉన్న ప్రతీసారి అల్లాహ్ వారి కొరకు స్వర్గంలో విందు ఏర్పాటు చేస్తాడు". (బుఖారి 662. ముస్లిం 669).